## క్లుప్తంగా

### వేమవరంలో గ్రామ సభ



మాచవరం: రెవెన్యూ రికార్డుల ప్రకారం చుక్కల భూములు కలిగిన రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని, రైతులు దరఖాస్తులు చేసుకుంటే పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని ట్రైనీ కలెక్టర్, ఇండిపెండెంట్ తహసీల్దారు కల్పనశ్రీ అన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలో రెవెన్యూ గ్రామ సభ సోమవారం నిర్వహించారు. చుక్కల భూములు కలిగిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రతి దరఖాస్తు ఆన్‌లైన్ చేసి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీటీ సరోజా, వీఆర్‌వో అఖిల్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### కారెంపూడి సీఐగా చిన మల్లయ్య



కారెంపూడి: కారెంపూడి సీఐగా చిన మల్లయ్య నియమితులయ్యారు. ఆయన గుంటూరు సీసీఎస్‌లో పని చేస్తూ కారెంపూడి సీఐగా బదిలీ అయ్యారు. ఇక్కడ కారెంపూడిలో పని చేస్తున్న దార్ల జయకుమార్ మేడికొండూరు సీఐగా బదిలీ అయ్యారు. మంగళవారం చిన మల్లయ్య విధుల్లో చేరనున్నట్లు తెలుస్తోంది. నూతన సీఐ రాగానే తాను రిలీవ్ అవుతానని కారెంపూడి సీఐ జయకుమార్ సోమవారం సాయంత్రం తెలిపారు.

### ఎస్ఈబీ సీఐగా సూర్యనారాయణ



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల ఎస్ఈబీ సీఐగా డి.సూర్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్.కొండారెడ్డి బదిలీపై గిద్దలూరు వెళ్లటంతో బదిలీల్లో భాగంగా తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ఎస్ఈబీ స్టేషన్ నుంచి పిడుగురాళ్ల ఎస్ఈబీ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని, నిషేధిత తెలంగాణ మద్యం, ఇతర మద్యాన్ని సరఫరా చేసినా శాఖాపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఎస్ఈబీ సీఐ సూర్యనారాయణ తెలిపారు.

### నేడు మండలంలో ఎమ్మెల్యే కాసు పర్యటన

మాచవరం: నేడు మాచవరం మండలంలోని పిన్నెల్లి, గంగిరెడ్డిపాలెం, మాచవరం, కొత్తపాలెం, మోర్జంపాడు, పిల్లుట్ల, మల్లవోలు గ్రామాల్లో గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో డ్వాక్రా మహిళలతో సమావేశమై, ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఆసరా చెక్కులు అందజేస్తారని తెలిపారు. మాచవరం జెడ్పీ హైస్కూల్‌లో నాడు–నేడు ద్వారా నూతనంగా నిర్మించిన తరగతి గదుల ప్రారంభోత్సవం, పిల్లుట్లలో పీహెచ్‌సీకి శంకుస్థాపన, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. కావున మండలంలోని ఆయా గ్రామాల డ్వాక్రా మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### 'కన్యక' చిత్రం షూటింగ్ పూర్తి

నకరికల్లు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో శ్రీ కాశీవిశ్వనాథ్ పిక్చర్స్ వారి కన్యక చిత్రం ఆఖరి షెడ్యూల్‌ను సోమవారం చిత్రీకరించారు. దర్శకుడు తిరువాయిపాటి రాఘవ మాట్లాడుతూ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి మహిమలపై ప్రత్యేకంగా రచించిన పాట చిత్రీకరణతో షూటింగ్ పూర్తయిందన్నారు. డివోషనల్, హారర్, థ్రిల్లర్ అంశాలతో ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే విధంగా సినిమా ఉంటుందని తెలిపారు. చిత్రంలో మమత, శిరీష, జయ, రేవతి, శివరామరాజు, జబర్దస్త్ వాసు, ఈశ్వర్, ప్రసాదరావు నటించారన్నారు. కొరియోగ్రాఫర్ శ్యామ్ పాటకి నృత్యం సమకూర్చారు. నిర్మాతలుగా స్థానికులైన కె.అమరలింగేశ్వరరావు, ఎ.సాంబశివరావు, కె.పూర్ణచంద్రరావు వ్యవహరించారు. డిస్ట్రిబ్యూటర్ డీకే బోయపాటి మాట్లాడుతూ 30 ఓటీటీ ప్లాట్ ఫామ్స్‌పై సినిమా రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు.

### నేడు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత పంపిణీ ప్రారంభం

నకరికల్లు: వైఎస్సార్ ఆసరా నాలుగో విడత ద్వారా మండలంలోని 1,041 గ్రూపులకు రూ.8,41,35,047లు లబ్ధిదారుల ఖాతాల్లో మంగళవారం జమ చేయనున్నట్లు ఏపీఎం సునీత తెలిపారు.. గత విడతల్లో రూ.33,65,40,188లను ప్రభుత్వం జమచేసిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభ కార్యక్రమాన్ని ఆర్బీకేల్లోని టీవీల ద్వారా మహిళలు వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.



కొత్తపల్లి కోదండ రామాలయంలో ప్రత్యేక అలంకరణలో రాములవారు



శ్రీరాము చిత్ర పటానికి పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తులు




పిడుగురాళ్ల తిరుమల ఆక్స్‌ఫర్డ్‌లో జై శ్రీరామ్ ఆకృతిలో విద్యార్థులు



శ్రీరాముని ఉత్సవ విగ్రహాలకు హారతి పడుతున్న మహిళలు



శ్రీరాముని ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగిస్తున్న మహిళలు

# శ్రీరామ నామంతో పులకించిన భక్తజనం

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- బైక్ ర్యాలీలు, శోభాయాత్రలు

కారెంపూడి: అయోధ్యలో శ్రీరాముని దివ్య విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఇళ్లపై శ్రీరాముని చిత్రంతో ఉన్న కాషాయ రంగు జెండాలు సోమవారం రెపరెపలాడాయి. మండలంలోని వివిధ గ్రామాలలోని రామాలయాలలో, ఆంజనేయస్వామి, ఇతర దేవాలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని భజనలు చేశారు. కారెంపూడి చెన్నకేశవ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు శ్రీరామ జయ రామ జయ జయ రామ అంటూ భజనలు చేశారు. రాత్రి ఏడు గంటలకు ఆలయంలో నక్షత్ర హారతి దిగ్విజయంగా నిర్వహించారు. ప్రతి ఇంటా పండగ వాతావరణం నెలకొంది. గ్రామ ప్రధాన కూడళ్లలో శ్రీరాముని చిత్ర పటంతో పందిళ్లు వేశారు. రామ నామ స్మరణతో కూడిన పాటలు ఆలపించారు. పలుచోట్ల పులిహోర, వడపప్పు, పానకం కూడా పంపిణీ చేశారు. మొత్తం మీద కారెంపూడిలో ప్రజలు రామ నామంతో పరవశించి పోయారు.

**దాచేపల్లిలో...**

దాచేపల్లి : అయోధ్య కోదండరామస్వామి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండల వ్యాప్తంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. దాచేపల్లిలో ప్రత్యేకంగా అలంకరణ చేసిన పల్లకిపై స్వామివారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. జై శ్రీరామ్ నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య తదితరులు స్వామివారి పల్లకిని మోసారు. మండలంలోని తంగెడ గ్రామంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల శాఖ అధ్యక్షుడు కాసర్ల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కోదండరామస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తులసి పూజలు, శాంతి హోమం జరిపించారు. అనంతరం భక్తులు కోలాటం ప్రదర్శించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, కాసర్ల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మాచర్లలో...**

మాచర్ల: దేశ వ్యాప్తంగా సోమవారం ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఎటు చూసినా రామమందిర ప్రారంభోత్సవ వేడుకలను తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఘనంగా నిర్వహించారు. బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పూర్తయిన అనంతరం వేలాది మంది భక్తులు పట్టణంలో జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ జెండాలు పట్టుకొని ఊరేగింపు జరిపారు. పట్టణంలోని ప్రధాన రహదారి ప్రాంతంలో వేంచేసియున్న కోదండ రామాలయంలో ముందుగా శ్రీరామునికి ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా పట్టణంలోని రామాటాకీస్, పాతూరు ప్రాంతాలలో కాషాయ జెండాలతో తోరణాలు ఏర్పాటు చేశారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా నిలబడి జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు, ప్రముఖ సంఘ నేతలు, మహిళలు పాల్గొన్నారు. పట్టణంలోని పాతమాచర్ల ఆంజనేయ స్వామి, రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆంజనేయస్వామి, బస్టాండ్ సెంటర్‌లోని ఆంజనేయస్వామి, పాతూరులోని వెంకటేశ్వరస్వామి, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంతోపాటు పలు దేవాలయాలలో ఉదయం నుంచే భక్తులు శ్రీరాముని సేవలో తరించారు. ఈ సందర్భంగా ఆయా దేవాలయాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీలో పాల్గొని జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. పట్టణమంతా జైశ్రీరామ్ నినాదంతో దద్దరిల్లింది.



చెన్నకేశవాలయంలో రామ నామ స్మరణతో భజన చేస్తున్న భక్తులు



విజయపురిసౌత్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు



పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు



దాచేపల్లిలో పల్లకిపై స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం



తంగెడలో తులసి పూజ, శాంతిహోమం జరుగుతున్న దృశ్యం



చెన్నాయపాలెం కోదండరామ స్వామి ఆలయంలో పూజల్లో గ్రామస్తులు



ర్యాలీలో పాల్గొన్న ప్రముఖ నాయకులు

**వైభవంగా నగర సంకీర్తన**

మాచవరం: అయోధ్యలోని శ్రీరామమందిరంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో నగర సంకీర్తన, పూజా కార్యక్రమాలు, శోభాయాత్ర, ఊరేగింపు, శాంతి హోమం, భజన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో మహిళలు కోలాట ప్రదర్శన చేపట్టారు. గ్రామాల్లోని దేవాలయాల్లో ఆలయ పూజారులు స్వామి వారి పూజ విశిష్టతను వివరించారు.

**శ్రీరామునికి ప్రత్యేక పూజలు**

మాచర్ల రూరల్: అయోధ్య రామమందిరంలో బాలరాముని ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని పలు గ్రామాలలోని రామాలయాల్లో పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కంభంపాడు, కొత్తపల్లి, రాయవరం, తాళ్ళపల్లి, కొప్పునూరు, అచ్చమ్మకుంట తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పూజారులు బొప్పూడి గిరిశర్మ, కేశవ, మురళి నేతృత్వంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు జయప్రకాష్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, సురేష్, సీతారామయ్య, మల్లేశ్వరి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

**జై శ్రీ రామ్ ఆకృతిలో విద్యార్థులు**

పిడుగురాళ్ల: ప్రపంచానికి సాంస్కృతిక రాజ్యధానిగా భారత దేశం ఎదుగుదున్న వేళ, విశ్వశాంతి స్థాపనకు అహర్నిశలు కృషి చేస్తూ విశ్వగురువుగా కీర్తించబడుతున్న వేళ ప్రపంచానికి ఆధ్యాత్మిక శోభను అలంకరిస్తున్న వేళ సోమవారం అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని స్థానిక తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులు జై శ్రీరామ్ రూపంలో మానవహారం రూపొందించటం జరిగింది. తిరుమల ఆక్స్‌ఫర్డ్ ప్రిన్సిపల్ వెంకట్రావు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



రామాలయంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

**రామ నామస్మరణతో హోరెత్తిన పిడుగురాళ్ల..**

జై శ్రీరామ్ నామ స్మరణతో పిడుగురాళ్ల మార్మోగింది. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా పిడుగురాళ్ల పట్టణంలో శ్రీరాముని భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహాలతో ర్యాలీలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం నుంచి ఐలాండ్ సెంటర్ మీదుగా పంచముఖ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వరకు జై శ్రీరామ్ నినాదాలతో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఏర్పాటు చేసి ఊరేగింపు చేశారు. అలాగే నెమలిరెడ్డి బజారులో స్వామివారి ఉత్సవ విగ్రహాలతో ర్యాలీ నిర్వహించారు. అలాగే పట్టణంలోని పలువీధుల్లో భక్తులు విశేషంగా ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డు డైరెక్టర్ చీదెళ్ల కృష్ణ ఆధ్వర్యంలో స్వామివారి లడ్డూ ప్రసాదం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శ్రీరాముని చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ వెంకట రామారావు, పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు యల్లారావు, శంకర్ రావు, రామారావు, సాంబశివరావు, సుబ్బయ్య, కనకయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**విజయపురిసౌత్‌లో బైక్ ర్యాలీ**

విజయపురిసౌత్: అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని విజయపురిసౌత్‌లో భక్తులు సోమవారం బైక్ ర్యాలీ చేపట్టారు. గ్రామ పురవీధుల్లో తిరుగుతూ కాషాయ జెండాలను చేతబూని జై శ్రీరామ్ నినాదాలు చేశారు. స్థానిక సీతారామాలయంలో అర్చకులు బ్రహ్మచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠా కార్యక్రమం భక్తులు వీక్షించేలా ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. అలాగే సేవాలాల్ కీమాలాల్ జంక్షన్ ఆలయ ధర్మకర్త పాండునాయక్, ఆచార్య పాదుకా సేవాట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీమాన్ బ్రహ్మశ్రీ ఆధ్వర్యంలో భక్తులు జై శ్రీరామ్ నినాదాలతో శోభాయాత్ర చేపట్టారు. సీతారామాలయం కమిటీ, ఛత్రపతి శివాజీ మహారాజ్ సైన్యం, తదితరులు పాల్గొన్నారు.

**వాడవాడలా రాముల వారు**

పిడుగురాళ్లరూరల్: అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలు జై శ్రీరామ్ నామ కీర్తనతో పులకించిపోయాయి. సోమవారం మండలంలోని బ్రాహ్మణపల్లి, కామేపల్లి, కోనంకి, గుత్తికొండ, పందిటివారిపాలెం, జూలకల్లు, తుమ్మలచెరువు గ్రామాల్లోని రామాలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ తిలకించడం పూర్వజన్మ సుకృతం

రెంటచింతల: శతాబ్దాల స్వప్నం సాకారం చేస్తూ అయోధ్యాపురిలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని తిలకించడం ప్రతి ఒక్కరు పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నారని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన రెంటచింతలలో పెద్ద సంఖ్యలో భక్తులు, శ్రీ రామకృష్ణ గురుకుల పాఠశాల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ స్థానిక రామాలయం, శ్రీ వాసవి మాత, వెంకటేశ్వరస్వామి, సత్రశాల మల్లికార్జున స్వామి తదితర దేవాలయాలలో ప్రత్యేక పూజలు చేసి దీపాలను వెలిగించి అయోధ్య ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇళ్ల ముందు రంగులతో ముగ్గులు వేసి తోరణాలు కట్టి, దీపాలను వెలిగించి రాముని ప్రతిష్ఠ మహోత్సవాన్ని కనులపండుగగా జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పెదబాబు, కృష్ణారెడ్డి, కాశిరెడ్డి, రాముడు, నారపరెడ్డి, నర్సింహారావు, కేదార్‌నాథ్, శ్రీను, మల్లిఖార్జునరావు, రాఘవ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



రెంటచింతలలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, గ్రామ పెద్దలు

## విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



ట్యాబులు అందుకున్న విద్యుర్థులతో ప్రజాప్రతినిధులు



ట్యాబ్‌లతో విద్యార్థులు, నాయకులు

### విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేత

మాచవరం: విద్యాభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని జెడ్పీటీసీ జివ్వెన బోయిన శివాయాదవ్ అన్నారు. మండలంలోని వేమవరం జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు విద్యార్థులకు ట్యాబులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాదె కనకారెడ్డి, హెచ్ఎం నాగమల్లేశ్వరి, మాజీ సర్పంచ్ దొండేటి కృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ట్యాబ్‌ల పంపిణీ..**

పిడుగురాళ్లరూరల్: విద్యలో విప్లవాత్మకమైన మార్పులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని పందిటివారిపాలెం సర్పంచ్ నిమ్మల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం సోమవారం మండలంలోని పందిటివారిపాలెం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా నాడు నేడు కార్యక్రమంతో పాఠశాలలను అభివృద్ధి చేశారని, ఇంగ్లీష్ మీడియం విద్య అందజేస్తున్నారు. కార్యక్రమంలో పందిటి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ పందిటి వెంకటేశ్వరరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ కోటేశ్వరరావు, మాజీ మండల ఉపాధ్యక్షులు పందిటి నర్సిరెడ్డి, నిమ్మల అప్పిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, సీతరామిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నకరికల్లు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నర్సింగపాడు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఏఓ కె.దేవదాసు, ఎంఈఓ–2 నూనె ప్రసాద్, గ్రామ కార్యదర్శి అబ్దుల్లా పాల్గొన్నారు.



గ్యాస్ కనెక్షన్‌లను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ, వైస్ ఎంపీపీ

## నియోజకవర్గ ఓటర్ల తుది జాబితా సిద్ధం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్

- మొత్తం ఓటర్లు 2,59,279
- స్త్రీలు 1,32,031, పురుషులు 1,27,226, ట్రాన్స్‌జండర్స్ 22 మంది

మాచర్ల రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ తుది ఓటర్ జాబితాను సిద్ధం చేసి అందుబాటులో ఉంచామని తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఇంటింటికీ బీఎల్‌వోలు సర్వే చేసి ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేసి తుది జాబితాను విడుదల చేస్తున్నట్లు ఆయన చెప్పారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 2,59,279 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,27,226, స్త్రీలు 1,32,031, ట్రాన్స్‌జండర్స్ 22 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. తయారు చేసిన తుది జాబితాను ప్రతి పోలింగ్ బూత్‌లో, బీఎల్‌వోల వద్ద అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బూత్ కన్వీనర్ ఎన్.వెంకటేశ్వర్లు, కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ పార్టీల ప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు, డిప్యూటీ తహసీల్దార్‌లు షేక్ బాషా, బ్రహ్మం, ఆర్ఐ ఫణీంద్ర, సీనియర్ అసిస్టెంట్ షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

**గురజాల నియోజకవర్గంలో 2,71,277 మంది ఓటర్లు**

గురజాల : ఓటర్ జాబితాను రెవెన్యూ అధికారులు సోమవారం విడుదల చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు తుది ఓటర్ జాబితాను విడుదల చేశారు. నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. పురుష ఓటర్లు 1,32,131 మంది కాగా మహిళా ఓటర్లు 1,39,104 మంది, 42 మంది ట్రాన్సుజెండర్‌లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

**పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో**

గురజాలలోని పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ డివిజన్ అధికారి రమాకాంత్ రెడ్డి సోమవారం సాయంత్రం పరిశీలించారు. గురజాల, జంగమహేశ్వరపురం, చర్లగుడిపాడు గ్రామాల్లో ఆర్డీవోతో పాటు తహసీల్దార్ మీసాల దానియేలు, కమిషనర్ అన్నదాత మోహన్ శ్రీనివాసరావు బీఎల్‌వోలు తదితరులున్నారు.

**రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం**

రాజకీయ పార్టీ నాయకులతో తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ తుది జాబితాను అధికారులు పలు రాజకీయ పార్టీ నాయకులకు అందించారు. తుది జాబితాపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. పలు సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి రాజకీయ పార్టీ నాయకులు తీసుకువెళ్లగా వాటిని నివృత్తి చేసారు.